# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :127 EDITOR:CHERUKU UPENDAR, DATE : THURSDAY 14 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 127 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 14 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## మరో 9 వందే భారత్ ట్రైన్లు


న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



దేశంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక గుర్తింపును పొందింది. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం వందేభారత్. కాగా, దేశంలో త్వరలో మరో 9 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందు బాటులోకి రానున్నాయని భారతీయ రైల్వే తెలిపింది. వందేభారత్ రైళ్లు ప్రస్తుతం

మిగతా 2లో...

## మళ్లీ 16న హైదరాబాద్‌కు అమిత్‌షా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ విమోచన దిన వేడుకల కోసం కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్ర నేత అమిత్ షా తెలంగాణకు రానున్నారు. సెప్టెంబరు 17న ఈ వేడుకల్లో పాల్గొనడానికి ఒక్కరోజు ముందే అమిత్ షా హైదరాబాద్‌కు వస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. ఈనెల 16న రాత్రి 7.55 గంటలకు ఔరంగాబాద్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రానున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సీఆర్పీఎఫ్ సెక్టార్స్ ఆఫీసర్స్ మెస్‌కు చేరుకుని ఆ రోజు రాత్రి అక్కడే బస చేయనున్నారు. 17న ఉదయం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ కు చేరుకుని తెలంగాణ

మిగతా 2లో...

## కాంగ్రెస్‌లో ... ఆల్ ఈజ్ వెల్

- 119 నియోజకవర్గాలకు వెయ్యికి పైగా దరఖాస్తులు - ఈనెల 22న పార్టీ అభ్యర్థుల ప్రకటన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



క్యాడర్ పుష్కలం. ఓటు బ్యాంకు కూడా అధికం.కానీ గత రెండు దఫాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టలేకపోయింది. ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని అనుకున్న సమయంలో తెలంగాణలో కాంగ్రెస్ ఈసారైనా పట్టు నిలుపుకోగలుగుతుందా? లేదా ఎప్పటిలాగే చతికలపడుతుందా? అన్నదే ప్రశ్న. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ను ప్రజలు గౌరవిస్తారు. అండగా నిలవాలని భావిస్తారు.కానీ నేతల స్వయంకృతాపరాధంతోనే గత రెండు ఎన్నికల్లో అనేక సీట్లు చేజారి పోయాయి. కానీ ఈసారి అలాంటి అవకాశాలకు తావివ్వకుండా ఎలాగైన పవర్ లోకి రావాలని ప్రతి ఒక్క కాంగ్రెస్ నేతతో పాటు కార్యకర్తకూడా భావిస్తున్నారు. కాంగ్రెస్ నేతల్లో ఐక్యత కూడా కనిపించడం శు భపరిణామంగా చెప్పాలి.కాంగ్రెస్ వైరస్ లాంటిదంటారు. దానికి చావులేదనేది రాజకీయంగా అందరూ ఒప్పుకునే వాస్తవం. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ కాంగ్రెస్

మిగతా 2లో...

## రాష్ట్రపతి పాలన పెడతారా..?

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఆలస్యం కావొచ్చని పార్లమెంట్‌తో పాటు మే నెలలో జరిగినా ఆశ్చర్యం లేదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీశాయి. భారత ప్రజాస్వామ్యంలో ఇలా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఆలస్యం కావడం అనేదే లేదు. ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ పదవి కాలం పూర్తయ్యే లోపు కొత్త ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకునేలా ఈసీ ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎన్నికలు నిర్వహించలేని సందర్భమే లేదు. ఎన్నికలు నిర్వహించి తీరాలి. ఎందుకంటే అది రాజ్యాంగ నిబంధన కానీ ఈ సారి జమిలీ ఎన్నికల ఆలోచనలో ఉన్న కేంద్రం.. మొదటి సారి మినీ జమిలీకి ప్లాన్ చేస్తోందన్న వాదన వినిపిస్తోంది. ఈ కారణంగా ప్రత్యేకంగా రాజ్యాంగ సవరణ చేసి మరీ డిసెంబర్ లో జరగాల్సిన ఐదు రాష్ట్రాల ఎన్నికలను ఆలస్యం చేస్తారని అంటున్నారు. నిజంగా ఇలా చేస్తే తెలంగాణ రాజకీయాల్లో పరిస్థితి ఏమిటన్నది అప్పుడే

మిగతా 2లో...

## చంద్రబాబుకు ప్రాణహాని

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల విషయంలో వివిధ రాజకీయ నేతలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడంతో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో చంద్రబాబు అరెస్టు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై కూడా ఆయన స్పందించారు.“ఏ పరిస్థితుల్లోనూ 29 రాష్ట్రాలతో కలిపి జమిలి ఎన్నికలు జరగవు. మినీ జమిలి ఎన్నికలకు మాత్రం ఆస్కారం ఉంది. 15 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అసెంబ్లీ రద్దు చేయండి. అప్పుడు మొత్తం 19 రాష్ట్రాలు, లోక్‌సభ కలిపి ఎన్నికలు జరపవచ్చు. ఇదే విషయంపై నేను ప్రధాని కార్యాలయంలో లెటర్ ఇచ్చాను. హోంశాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖలో కూడా లేఖలు ఇస్తాను. ప్రధాని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రభుత్వ పదవీకాలం పూర్తయ్యే 3 నెలల లోపు ఎప్పుడైనా ఎన్నికలు



పెట్టొచ్చు. అంతే తప్ప ఒక్క రోజు కూడా ప్రభుత్వాన్ని పొడిగించే అవకాశం లేదు. జనవరి 15న గం. 12.00కు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంటే గం. 11.59 నిమిషాల్లోపు కొత్త ప్రభుత్వం కొలువుతీరాలి.ఒక గంట పొడిగించాలన్నా సరే రాజ్యాంగ సవరణ చేయాలి. 1971లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ పెట్టి పార్లమెంట్, అసెంబ్లీల పరిధి ఆరేళ్లకు పెంచింది. ఆర్డినెన్స్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గడువు పెంచింది. రాజ్యాంగ సవరణ చేయాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆమోదించాలి. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తున్నారు. ఎన్నికలు రెండు నెలలు ముందూ, వెనుకా ఎప్పుడైనా జరగొచ్చు అని కొందరు నేతలు అంటున్నారు.

మిగతా 2లో...

## 15న కామారెడ్డి జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం

- సీఎం కేసీఆర్ మెడికల్ కాలేజీని వర్చువల్ గా ప్రారంభిస్తారు
- కామారెడ్డి ప్రజల చిరకాల కోరిక నెరవేర్చిన సీఎం కేసీఆర్
- కృతజ్ఞతగా 15 వేల నుండి 20 వేల మందితో బైక్ ర్యాలీ
- ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

కామారెడ్డి- ప్రభాత సూర్యుడు

కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి లో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 15 న వర్చువల్ విధానం ద్వారా ప్రారంభిస్తున్న కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు విజయవంతం చేయవలసినదిగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామాత్యులు వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ లోని స్టేట్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, యెల్లారెడ్డి, జుక్కల్ శాసనసభ్యులు జాజాల సురేందర్, హనుమంత్ షిండే, ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ముజిబుద్దీన్, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ లతో కలిసి అంతర్గత సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి వేముల మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన వైద్య సాయం అందించడంతో పాటు పేద విద్యార్థులు వైద్య విద్య నభ్యసించుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తున్నదని అన్నారు. అందులో భాగంగా కామారెడ్డితో పాటు రాష్ట్రంలోని మరో 8 జిల్లాలలో వైద్య కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామంత్రి హరీష్ రావు సమక్షంలో వర్చువల్ పద్ధతిన ప్రారంభించనున్నారని అన్నారు. వచ్చే ఏడాది మరో 9 జిల్లాలలో వైద్య కళాశాలను ఏర్పాటు కానున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ఏర్పాటు తో పాటు 330 పడకల స్థాయి వైద్య కళాశాల ప్రారంభించుకుంటున్నందున ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పండుగ వాతా వరణంలో కార్యక్రమాన్ని వీక్షించ డంతో పాటు, ఆ తరువాత ఏర్పాటు చేసే పెద్ద ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయవలసినదిగా కోరారు. సుమారు 15 నుండి 20 వేల మంది ప్రజలు ర్యాలీలో భాగ స్వాములు అయి రాష్ట్ర ముఖ్యమంత్రికి కృజ్ఞతలు తెలపాలని మంత్రి పిలుపునిచ్చారు.దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయం తీసుకొని ప్రతి జిల్లాలో వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా డాక్టర్ల ఉత్పత్తి గణనీ యంగా పెరుగుతుందని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య



సేవలు అందించవచ్చని అన్నారు. నూతన వైద్య కళాశాలలో 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు కాగా 15 శాతం ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఉంటుందని అన్నారు. నీట్ లో లక్షకు పైగా రాంక్ వచ్చిన వైద్య కళాశాలలో సీటు ఖచ్చితంగా వస్తుం దని అన్నారు. తెలంగాణా ఏర్పడక ముందు రాష్ట్రంలో ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలుండగా నేడు 28 కి పెరిగాయని అంటే 5 రేట్లు అధికమయ్యాయని, డాక్టర్ల సీట్ల సంఖ్య కూడా 2850 నుండి 8515 కు పెరి గాయని అన్నారు. ఎక్కడైనా ప్రైవేట్ యాజమాన్యంలో వైద్య కళాశాలలు పెరుగుతాయని కానీ మన రాశే్త్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలు పెరిగాయని అన్నారు. ఇక ప్రతి సంవత్సరం 8,515 మంది డాక్టర్లు ఒక్క మన రాష్ట్రం నుండే ఉత్పత్తి అవుతారని అన్నారు. దేశ జనాభాలో రాష్ట్ర జనాభా 3 శాతం కాగా, రాబోయే రోజుల్లో మన రాష్ట్రం నుండి దేశానికి 40 శాతం మంది డాక్టర్లను అందించనున్నామని అన్నారు. అదేవిధంగా గతంలో 1183 పై.జి. సీట్లు ఉండడగా నేడు 2,890 కి, సూపర్ స్పెషాలిటీ లో 27 నుండి 179 సీట్లు పెరిగాయని, నిజంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పని మంత్రి చెప్పారు.

## వివాదాల కాకతీయ యూనివర్సిటీ



వరంగల్- ప్రభాత సూర్యుడు

కాకతీయ యూనివర్సిటీ రగిలిపోతోంది. పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు, సంఘాలు నిరసన చేపట్టగా పోలీసులు అరెస్ట్ చేయడం, తమ కాళ్లు, చేతులు విరిగేలా కొట్టారంటూ స్టూడెంట్లు ఆరోపణలు చేయడం, ఎంజీఎంలో అర్ధరాత్రి హైడ్రామా, పోలీసుల వివరణ, హాస్టళ్ల మూసివేత.. ఇలా కేయూలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలతో వర్సిటీ అట్టుడుకుతోంది. పీహెచ్?డీ అక్రమాలపై విచారణ జరపడంతో పాటు పోలీసుల దాడిని ఖండిస్తూ విద్యార్థులు నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. అయినా సర్కారు నుంచి స్పందన లేకపోవడంతో కేయూ స్టూడెంట్? జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. తమ ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలని వర్సిటీ ఆఫీసర్లు క్యాంపస్ కాలేజీలు, హాస్టళ్లకు సెలవులిచ్చి, తాళాలేశారని మండిపడుతున్నారు. పరీక్షలు కూడా వాయిదా వేయడంతో ఆఫీసర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఆరేండ్ల తర్వాత

మిగతా 2లో...

# చంద్రబాబుకు ప్రాణహాని

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను తప్పుదోవపట్టించవద్దు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి" అని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు చెప్పారు. నిన్న చంద్రబాబు హౌజ్ రిమాండ్ గురించి మాట్లాడుతూ.. చరిత్రలో హౌజ్ రిమాండ్ ఇచ్చిన ఉదంతాలు లేవు అని నిన్న చెప్పాను. 2021లో మహారాష్ట్రలో, పశ్చిమ బెంగాల్‌లో ముగ్గురి విషయంలో హౌజ్ రిమాండ్ ఇచ్చారు. ఈ నలుగురికి తప్ప మరెవరికీ ఇచ్చినట్టు చరిత్రలో లేదు. ఈ ఉదాహరణలు కోర్టులో వెల్లడిస్తే చంద్రబాబుకు కూడా హౌజ్ రిమాండ్ ఇచ్చే అవకాశం ఉంది. రాజకీయ ఖైదీలకు ప్రత్యేక సెల్, ప్రత్యేక వెసులుబాట్లు ఉంటాయి. బయటి నుంచి కూరగాయలు తెప్పించుకోవచ్చు. వంట చేసుకోవచ్చు. నేను కూడా రాజకీయ ఖైదీగా నేను, నాయిని నర్సింహా రెడ్డి తదితరులు చాలా మంది ఉన్నాం. జైలర్లు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తారు. కాబట్టి కోర్టు చెప్పిన సదుపాయాలు జైలులో కల్పించలేదని నిన్న భువనేశ్వరి చెప్పారు.కోర్టుకు చెవులే ఉంటాయి. కళ్లు ఉండవు. చంద్రబాబుకు జైల్లో ప్రాణహానికి అవకాశం ఉంది. బయట నుంచి ఆహారం తీసుకెళ్లినా సరే.. మార్గ మధ్యలో అందులో విషం కలిపే అవకాశం ఉంది. మహారాష్ట్ర, బెంగాల్ తరహాలో చంద్రబాబుకు హౌజ్ రిమాండ్‌కు అవకాశం ఇవ్వండి. జగన్ దేనికైనా తెగించడానికి సిద్ధంగా ఉన్నారు. ఏ సర్వేలు చూసిన జగన్ కచ్చితంగా ఓడిపోతారని చెబుతున్నాయి. తెలుగుదేశం పార్టీకి 88 కంటే ఎక్కువ సీట్లు ఖాయం. పవన్ కళ్యాణ్ కలిస్తే 130 సీట్లు వస్తాయి. బాబు అరెస్టుతో తమ పని అయిపోయిందని వైఎస్సార్‌సీపీ నేతలు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగన్ ఓడిపోతే సభకు వెళ్లరు. చంద్రబాబును అరెస్టు చేయడం తెలుగు ప్రజలకు చీకటి రోజు. చంద్రబాబుపై పెట్టిన కేసుల్లో అసలు ఏమీ లేదు. జగన్ మీద ఉన్న కేసులు అలా కాదు. ఆయన ఆర్థిక పరిస్థితి ఏంటో నాకు తెలియదా? నేను కూడా వారికి ఆర్థిక సహాయం చేశాను. తేదీలతో సహా నేను చెప్పగలను. ఆయనకు ఈ వేల కోట్లు ఎక్కణ్ణుంచి వచ్చాయి? ఇప్పటికైనా జగన్ మారాలి. లేదంటే నీ వెంట ఉన్నవాళ్లంతా చెట్లు, పుట్టలు పట్టుకుని వెళ్లిపోవడం ఖాయం. కనుచూపు మేరల్లో ఉండరు. దేశం వదిలి పారిపోవాల్సి వస్తుంది. నీ చర్యల కారణంగా నీ వెంట ఉన్నవాళ్లు నష్టపోతారు.

**రేవంత్ వల్లే కాంగ్రెస్ పార్టీ మటాష్**

టీపీసీసీ గురించి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని మటాష్ చేస్తారు. కాంగ్రెస్ పార్టీని ఆయన వ్యక్తిగత పార్టీగా మార్చారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరి తెలంగాణ నుంచి పోటీ చేయాలని అనుకున్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఆమెను చేరకుండా అడ్డుకుంటున్నారు. ఇందుకు తగిన మూల్యం రేవంత్ చెల్లించుకోక తప్పదు. తెలంగాణపై తుమ్మల నాగేశ్వర రావు స్టాండ్ ఏంటి? మరి ఆయన్ను ఎలా పార్టీలోకి తెస్తున్నారు? మండవ, సీతా దయాకర్ రెడ్డి స్టాండ్ ఏంటి? వారిని ఎలా పార్టీలోకి తెస్తున్నారు? సమైక్యవాదం వినిపించిన సీపీఐ(ఎం)ను ఎందుకు దగ్గర తీసుకుంటున్నారు" అని ప్రశ్నించారు.

# మళ్లీ 16న హైదరాబాద్‌కు అమిత్‌షా

(మొదటిపేజీ తరువాయి)

విమోచన దిన వేడుకల్లో పాల్గొననున్నారు. ఆ తర్వాత జరిగే బహిరంగ సభలో తెలంగాణ ప్రజల నుద్దేశించి అమిత్ షా ప్రసంగించనున్నారు. ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి అమెరికా పర్యటనకు వెళ్లిన ఎంపీ బండి సంజయ్ నేడు తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న బండి సంజయ్‌కు బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. అమెరికాలో ఉన్న తెలుగు ప్రజలంతా మోదీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నట్టు బండి సంజయ్ తెలిపారు. ఇండియాలో ఎన్నారైలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చిన బెనిఫిట్లు చాలా ఉన్నాయని, అందుకే మరోసారి బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. భారతీయులందరూ అమెరికాలో గల్లా ఎగరేసుకొని తిరుగుతున్నామంటే అమెరికాలో మోదీకి ఉన్న గౌరవమే అని అన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే తప్ప అభివృద్ధి చెందబోదని అమెరికాలోని తెలంగాణ వాసులు చెప్పినట్లు బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో దసరా, సంక్రాంతి వచ్చినప్పుడు ఎలాగైతే సిటీ ఖాళీ అవుతుందో అదే విధంగా దేశంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. అమెరికాలోని భారత పౌరులు బీజేపీకి ఓటేసేందుకు వస్తామని చెప్పారని బండి సంజయ్ అన్నారు.

# ప్రారంభించిన జైల్లోనే.. ఖైదీగా

**రాజమండ్రి- ప్రభాత సూర్యుడు :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు మూడో రోజు జైలులో ఉన్నారు. స్కిల్ డెవలెప్‌మెంట్ స్కాం కేసులో చంద్రబాబుకు ఈ నెల 22 వరకూ జ్యుడిషియల్ కస్టడీకి న్యాయస్థానం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆయనకు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఖైదీ నెంబరు 7691 కేటాయించారు. అయితే ఇంటి నుంచే భోజనం, మందులు వస్తుండటంతో ఇప్పుడిప్పుడే ఆయన జైలు జీవితానికి అలవాటుపడుతున్నారని ఆయనను కలిసిన వారు చెబుతున్నారు. మానసికంగా... ఇప్పటి వరకూ చంద్రబాబును ఆయన కుటుంబ సభ్యులు మాత్రమే కలిశారు. భార్య భువనేశ్వరి, కుమారుడు నారా లోకేష్, కోడలు బ్రాహ్మణి ఆయనతో ములాఖత్ అయి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అయితే ఆయన ఆరోగ్యంగానే ఉన్నా, చంద్రబాబుకు అందుతున్న సౌకర్యాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన కొంత వ్యాయామం చేస్తూ శారీరకంగా ధృఢంగా ఉన్నప్పటికీ మానసికంగా కొంత కుంగిపోయినట్లు కనిపిస్తుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే ఇందులో ఆసక్తికరమైన విషయం ఏంటంటే చంద్రబాబు ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న స్నేహ బ్లాక్ లోని ప్రత్యేక గదిలో ఉంటున్నారు. ఆయనకు ఆ బ్లాక్ లో ఆ గదిని కేటాయించారు. అయితే రాజమండ్రి జైలులో ఈ బ్లాక్ ను చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ప్రారంభించారని అధికారులు చెబుతున్నారు.

# కాంగ్రెస్‌లో ఆల్ ఈజ్ వెల్

(మొదటిపేజీ తరువాయి)

క్రమంగా పుంజుకుంటుంది. టిక్కెట్ల కోసం పోటీ పడటం చూస్తేనే అర్థమవుతుంది. 119 నియోజక వర్గాలకు వెయ్యికి పైగా దరఖాస్తులు కాంగ్రెస్ పార్టీకి అందాయంటే ఆశావహుల సంఖ్య ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అభ్యర్థులు ఎవరూ ఊరికే టిక్కెట్లు ఆశించరు. హస్తం గుర్తుపై పోటీ చేస్తే గెలుస్తామన్న నమ్మకంతో పాటు జనంలో ఉన్నవేవ్ ను కూడా వారు క్షేత్రస్థాయిలో పసిగడతారు. అప్పుడే టిక్కెట్ల కోసం పోటీ పెరుగుతుంది. రెండు సార్లు ఓటమి పాలయిన పార్టీ అయినప్పటికీ గాంధీభవన్ లో టిక్కెట్ ల కోసం జరిగిన జాతర చూసిన వారెవరికైనా కాంగ్రెస్ కు కొంత సానుకూల పరిస్థితులు న్నాయని ఇట్టే గ్రహించవచ్చు. అందుకేనేమో కాంగ్రెస్ నేతలు ఈసారి ఐక్యతారాగంతో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ అయితే ఎలాంటి గొడవలు లేవు. వీధినపడి విమర్శలు చేసుకోవడం లేదు. రేపు టిక్కెట్ల కేటాయింపు తర్వాత కూడా ఇదే పరిస్థితి ఉండి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం అందరూ కలసి పనిచేస్తే మాత్రం కొన్ని జిల్లాల్లో క్లీన్ స్వీప్ చేసే అవకాశాలు కూడా లేకపోలేదంటున్నారు. కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ ఈసారి ఏకపక్ష విజయాలు సాధించే అవకాశాలు న్నాయన్న సర్వేలు కూడా నేతల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. హైదరాబాద్ నగరంలో మాత్రం బలహీనంగానే కనడుతుంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కొంత పుంజుకోగలిగితే కాంగ్రెస్ పార్టీ ఈసారి అందలమెక్కడం ఖాయమన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇక్కడ మాత్రం? అయితే హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటి వరకూ ఫోకస్ పెట్టలేదు. నిజామాబాద్, మహబూబ్ నగర్, మెదక్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లోనూ హస్తం పార్టీ ఇంకా వీక్ గానే కనపడుతుంది. అక్కడ పుంజుకో గలిగితేనే అధికారానికి చేరువవుతుంది. లేకుంటే మూడోసారి కూడా తెలంగాణలో అధికారంలోకి రావడం కష్టమేనన్నది విశ్లేషకుల అంచనా. టిక్కెట్లు ఖరారయిన తర్వాత ఎటువంటి వైరుధ్యాలు, విభేదాలు లేకుండా సమిష్టిగా పనిచేస్తే మాత్రం ఈసారి కొంత కాంగ్రెస్ కు ఛాన్స్ ఉంటుంది. లేకపోతే కేసీఆర్ హ్యాట్రిక్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నది కూడా అంతే వాస్తవం. మరి కాంగ్రెస్ నేతలు ఐక్యతతో పార్టీని గెలిపించుకుంటారా? లేదా ఎప్పటిలాగానే వీధినపడి పవర్ ను చేజేతులా చేజార్చుకుంటారా? అన్నది చూడాల్సి ఉంది.

**22న కాంగ్రెస్ లిస్ట్...**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తోంది కాంగ్రెస్ పార్టీ. అభ్యర్థుల ఎంపికలో ఆలస్యం జరుగుతున్నా ఆచి తూచి అడుగులు వేస్తోంది. నిన్న గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అభ్యర్థుల ఎంపికై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు వెయ్యికిపైగా ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. వీటితో... దాదాపు 40 స్థానాల్లో అభ్యర్థుల ఎంపికై ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో మొదటి జాబితా రిలీజ్ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి జాబితా ఈనెల 22న రిలీజ్ అవుతుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. 40 మంది అభ్యర్థులతో జాబితా ఉంటుందని సమాచారం. కాంపిటీషన్ లేని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించేందుకు తెలంగాణ కాంగ్రెస్ సిద్ధమవుతోంది. తొలి జాబితాలో సీనియర్? నాయకుల పేర్లు ఉంటాయని భావిస్తున్నారు. నిన్న గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశంలో 40 స్థానాల్లో అభ్యర్థుల ఎంపికై ఏకాభిప్రాయం కుదిరింది..మిగితా స్థానాల్లో ఇద్దరు లేదా ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది పోటీ ఉండటంతో ఆయా స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై మరోసారి భేటీ అయ్యి చర్చించనుంది కమిటీ. ఈ నెల 20న ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ మీటింగ్ తర్వాత లిస్టును రిలీజ్ చేయనున్నట్టు సమాచారం. ఈనెల 19నే ఢిల్లీలో స్క్రీనింగ్ మీటింగ్ పెట్టాలని భావించినప్పటికీ.. పార్లమెంట్ సమావేశాలు, సీడబ్ల్యూసీ మీటింగ్, తెలంగాణలో సోనియా సభ ఉండటంతో ఒక రోజు ఆలస్యంగా స్క్రీనింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మీటింగ్ తర్వాత అభ్యర్థుల తొలి జాబితాను ఫైనల్ చేయనున్నారు. అభ్యర్థుల ప్రకటన ఇప్పటికే ఆలస్యమైందని నేతల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో... పార్టీ తొందరప డుతోంది. మరో 10 రోజులు అభ్యర్థుల లిస్ట్ ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. కాంగ్రెస్ అభ్యర్థుల మొదటి జాబితాలో ఎవరెవరి పేర్లు ఉన్నాయనేది ఉత్కంఠగా మారింది.

ఈ జాబితాలో దాదాపు సీనియర్ల పేర్లు ఉంటాయని భావి స్తున్నారు. కాంగ్రెస్ నుంచి దాదాపు ఖరారైన అభ్యర్థులు జాబితాలో నల్గొండ నుంచి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, హుజూర్‌నగర్ నుంచి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి పద్మావతి, ఆలేరు నుంచి బీర్ల ఐలయ్య, నాంపల్లి నుంచి ఫిరోజ్ ఖాన్, జూబ్లీహిల్స్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి, వికారాబాద్ నుంచి గడ్డం ప్రసాద్‌కుమార్, వికారాబాద్ నుంచి గడ్డం ప్రసాద్‌కుమార్, ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి నుంచి టి.రామ్మో హన్‌రెడ్డి ఉండే అవకాశం ఉంది. కాంగ్రెస్ ఫస్ట్ లిస్టు ఉండే నేతలు వీరే..?అలాగే.. నర్సంపేట నుంచి దొంతి మాధవరెడ్డి, వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ, ములుగు నుంచి సీతక్క, భూపాలపల్లి నుంచి గండ్ర సత్యనారాయణ, కొల్లాపూర్ నుంచి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి నుంచి వంశీచంద్‌రెడ్డి, అచ్చంపేట నుంచి వంశీకృష్ణ, షాద్‌నగర్ నుంచి ఈర్లపల్లి శంకర్, కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి, అలంపూర్ నుంచి సంపత్‌కుమార్, సంగారెడ్డి నుంచి జగ్గారెడ్డి, ఆందోల్ నుంచి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ నుంచి ఎ.చంద్రశేఖర్, నర్సాపూర్ నుంచి అనిల్‌కుమార్, నిర్మల్ నుంచి శ్రీహరిరావు, మంచిర్యాల నుంచి ప్రేమ్ సాగర్ రావు, జుక్కల్ నుంచి గంగారాం, కామారెడ్డి నుంచి షబ్బీర్‌అలీ ఉంటారని సమాచారం. మధిర నుంచి భట్టి విక్రమార్క, భద్రాచలం నుంచి పొదెం వీరయ్య, కొత్తగూడెం నుంచి పొంగులేటి శ్రీనివా సరెడ్డి, మంథని నుంచి శ్రీధర్‌బాబు, వేములవాడ నుంచి ఆది శ్రీనివాస్, జగిత్యాల నుంచి జీవన్‌రెడ్డి, హుజురాబాద్ నుంచి బల్మూరి వెంకట్, చొప్పదండి నుంచి మేడిపల్లి సత్యం, మానకొండూరు నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ, రామగుండం నుంచి రాజ్‌ఠాకూర్, పెద్దపల్లి నుంచి విజయ రమణారావు, ధర్మపురి నుంచి లక్ష్మణ్, కోరుట్ల నుంచి జువ్వాడి నర్సింగ్‌రావును ఫైనల్ చేసినట్టు సమాచారం.

# వివాదాల కాకతీయ యూనివర్శిటీ

(మొదటిపేజీ తరువాయి)

కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ రిలీజ్ చేయగా..పైరవీలు, కాసులకు కక్కుర్తి పడి ఆఫీసర్లు వాటిని అమ్ముకున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ నెల మొదటి వారం నుంచి స్టూడెంట్లు ఆందోళనకు దిగారు. అక్రమాల వల్ల అర్హత కలిగిన విద్యార్థులకు అన్యాయం జరుగుతోందంటూ ప్రిన్సిపాల్ ఆఫీసులో నిరసన చేపట్టగా పోలీసులు అరెస్టు చేశారు. తమను టాస్క్? ఫోర్స్? ఆఫీస్?కు తీసుకెళ్లి కొట్టడంతో కాళ్లు, చేతులు విరిగాయని ఆరోపించారు. అప్పటినుంచి క్యాంపస్ అగ్నిగుండంగా మారగా.. విద్యార్థులు చేపట్టిన నిరసన దీక్షకు వివిధ పార్టీల మద్దతు తెలుపుతుండడం, వారి రోజూవారీ ఆందోళనలతో క్యాంపస్? హోరెత్తుతోంది. పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకత వకలపై తాము చేస్తున్న ఉద్యమాన్ని చల్లార్చేందుకు వర్సిటీ అధికారులు ఏ కారణం చూపకుండానే ఈ నెల 3 నుంచి 10 వరకు క్యాంపస్? కు సెలవులు ప్రకటించారని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. అప్పటికీ తాము శాంతించక పోవడంతో 18వ తేదీ వరకు సెలవులు పొడిగించారంటున్నారు. హాస్టళ్లు క్లోజ్? చేసి తాళాలు వేయడంతో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వచ్చిందని చెబుతున్నారు. సెలవులు ప్రకటించిన ఆఫీసర్లు వర్సిటీ పరిధిలో జరగాల్సిన బీపీఎడ్?, ఎంపీఎడ్?, ఎల్?ఎల్?బీ(3 వైడీసీ, 5వైడీసీ) ఫైనల్ సెమిస్టర్ల పరీక్షలు కూడా వాయిదా వేశారు. బీపీఎడ్ ?గ్రూపులకు సెప్టెంబర్? 6 నుంచి 13వరకు, ఎల్?ఎల్?బీ పరీక్షలు 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరగాల్సి ఉంది.

కానీ, 18వ తేదీ వరకు సెలవులు ప్రకటించిన ఆఫీసర్లు మళ్లీ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ పరీక్షలు అయ్యాక ఏం చదవాలో ప్లాన్?తో ఉన్న విద్యార్థులు గందరగోళంలో పడ్డారు.వర్సిటీ వీసీగా తాటికొండ రమేశ్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అక్రమాలు పెరిగిపోయాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఆయనకు వీసీగా కొనసాగే అర్హతే లేదని, వీసీ వచ్చినప్పటి నుంచి కేయూలో జరిగిన పరిమాణాలు, వీసీగా పాలనపై సోమవారం కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో చార్జ్‌షీట్? రిలీజ్? చేశారు. పీహెచ్?డీ కేటగిరీ 1, 2 అక్రమాలు, కేయూ భూముల కబ్జాలు, వర్సిటీలో అక్రమ నియామకాలు, వీసీపై ఉన్న కేసులు, అక్రమ బదిలీలు తదితర అంశాలను అందులో పొందుపరిచారు. రెండున్నరేండ్లలో వీసీ చేసిన అవినీతి, అక్రమాలపై కమిటీ వేసి విచారించాలని స్టూడెంట్స్ డిమాండ్? చేస్తున్నారు.

# మరో 9 వందే భారత్ ట్రైన్లు

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 25 రూట్లలో నడుస్తున్నాయి. అంతే కాకుండా మరో 9 రైళ్లను ప్రవేశ పెట్టాలని భారతీయ రైల్వే యోచిస్తోంది. త్వరలో పట్టాలెక్కనున్న ఈ కొత్త రైళ్లను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేసినట్టుగా సమాచారం. ట్రాక్‌పైకి వచ్చే కొత్త రైళ్లలో ఎక్కువ భాగం ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లకు వెళ్తాయి. ఇందుకోసం రైల్వే మంత్రిత్వ శాఖ రెండు రాష్ట్రాల్లోనూ భారీ కార్యక్రమాలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రెండు రాష్ట్రాల్లోనూ పలు రైళ్లు ఒకేసారి ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే, భారతీయ రైల్వేలు కొత్తగా ప్రారంభించనున్న 9 వందే భారత్ రైళ్లలో 5 రైళ్ల మార్గాలను విడుదల చేసింది. ఆ మార్గాలు ఇలా ఉన్నాయి.

**రూట్ 1: ఇండోర్ -జైపూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్**

**రూట్ 2: జైపూర్-ఉదయ్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్**

**రూట్ 3: పూరి -రూర్కెలా వందే భారత్ ఎక్స్‌ప్రెస్**

**రూట్ 4: పాట్నా-హౌరా వందే భారత్ ఎక్స్‌ప్రెస్**

**రూట్ 5: జైపూర్-చండీగఢ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్**

భారతీయ రైల్వేల అందించిన సమాచారం మేరకు..వీటిలో ఐదు మార్గాలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కోసం ఇప్పటికే కేటాయించబడ్డాయి. వీటితో పాటు, మూడు మార్గాలు దక్షిణ రైల్వేకు ఇవ్వబడ్డాయి. అయితే, కొత్త వందే భారత్ రైళ్లను ఏ రాష్ట్రానికి అందిస్తారో ఇంకా ఖరారు కాలేదు. అంతే కాకుండా చివరి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఎక్కడికి ఎక్కించాలనేది ఇంకా నిర్ణయించలేదని సమాచారం.దక్షిణ రైల్వే అందుకున్న 3 రైళ్లలో ఒకటి మంగళూరు-తిరువనంతపురం అని సమాచారం.

ఈ మార్గంలో కొత్త రైలును ప్రవేశపెట్టేందుకు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. జీ 20 సమ్మిట్‌కు ముందు, ఉ20 దేశాలకు చెందిన మీడియా ప్రతినిధుల బృందం గాంధీనగర్-ముంబై వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించి, ప్రయాణ అనుభవం పట్ల తమ ఆనందాన్ని వ్యక్తం చేసింది.

# రాష్ట్రపతి పాలన పెడతారా..?

(మొదటిపేజీ తరువాయి)

చర్చనీయాంశంగా మారింది. మినీ జమిలీ ఎన్నికల కోసం రాజ్యాంగ సవరణ చేస్తే.. ఎన్నికలు మేలో జరుగుతాయి. తెలంగాణ అసెంబ్లీ ప్రస్తుత పదవీ కాలం జనవరి రెండో వారానికి ముగిసిపోతుంది. మరి ఎన్నికలు జరిగే మే వరకూ ఏ ప్రభుత్వం పాలన చేస్తున్నారు. అసలు ప్రజాప్రతినిధులే ఉండరు కాబట్టి.. ప్రభుత్వం అనే మాటే రాదు. ఆపద్ధర్మ సీఎం అనే మాట వినిపించే అవకాశం లేదు. అలాగని.. ప్రభుత్వాన్ని మరికొంత కాలం పొడిగించే చాన్స్ అసలు లేదు. రాజ్యాంగ సవరణలో ప్రభుత్వ పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ ఏమైనా మార్పులు చేస్తే.. అప్పుడు అవకాశం ఉండొచ్చు. కానీ ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన ప్రభుత్వాన్ని కొత్తగా చేసే సవరణ ద్వారా పొడిగించడం ఎలా సాధ్యమన్న సందేహం ఎవరికైనా వస్తుంది. ఐదేళ్ల పదవీ కాలానికి మాత్రమే ప్రజలు ఓట్లేశారు. అంతకు మించి పదవిలో ఉండటానికి రాజ్యాంగం అంగీకరించదు. ఇలాంటి పరిస్థితి వస్తే ఎక్కువగా అవకాశం ఉన్న చాయిస్..రాష్ట్రపతి పాలన. సంక్షోభ పరిస్థితుల్లో రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధిస్తూ వస్తున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ప్రయోగాలు చేయకపోయినా.. ఇప్పుడు జమిలీ ఎన్నికల కోసం ఐదు రాష్ట్రాల్లో ఏదో ఓ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకే రాష్ట్రపతి పాలన విధించడం అనేది చాలా తేలికైన ఆప్షన్. అదే ప్రభుత్వాల అధికారాన్ని పొడిగిస్తే భవిష్యత్‌లో చాలా సమస్యలు వస్తాయి. అందుకే రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా.. సమస్యను సులువుగా అధిగమించే అవకాశం ఉంది. ఇది బీజేపీకి కూడా కలిసి వస్తుంది. తెలంగాణ, చత్తీస్ ఘడ్, రాజస్థాన్‌లలో బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధిస్తే కేంద్ర పాలన వచ్చినట్లే. ఎన్నికలకు ఇది అడ్వాంటేజ్ అవుతుందన్న అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వాల పదవీ కాలాన్ని పొడిగిస్తే.. బీఆర్ఎస్ జమిలీ ఎన్నికల విషయంలో ఇష్టం లేకపోయినా... అంగీకరించే అవకాశం ఉంది.

కానీ.. రాష్ట్రపతి పాలన విధిస్తామంటే మాత్రం తీవ్రంగా వ్యతిరేకించే అవకాశం ఉంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేరు అన్న ఊహను బీఆర్ఎస్ వర్గాలు అంచనా వేయలేవు. అధికార పగ్గాలు కేసీఆర్ చేతుల్లో లేకుండా ఐదారు నెలలు కేంద్ర పాలన సాగిందంటే ఎన్నో రకాల రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయి. అలాంటి వాటికి ఆస్కారం ఇవ్వకూడదని బీఆర్ఎస్ భావిస్తుంది. అందుకే రాష్ట్రపతి పాలన తర్వాత ఎన్నికలంటే బీఆర్ఎ? అంగీకరించే అవకాశం ఉంది. అలాగే కాంగ్రెస్ కూడా వ్యతిరేకిస్తుంది.అయితే ఏ నిర్ణయం తీసుకోవాలన్నా బీజేపీకి అధికారం ఉంది. మెజార్టీ ఉంది. అందుకే తాను చేయాలనుకున్నది చేస్తుంది.

## సంపాదకీయం

# ఏమన్న కొందామంటె జేబుకు చిల్లు

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. ఏమన్న కొందామంటె జేబుకు చిల్లు పడ్తది.. వద్దనుకుంటెనో కడుపు మాడుతది.. ఇదీ ప్రస్తుతం దేశంలో సామాన్య ప్రజల పరిస్థితి.. నిత్యావసరాల ధరలు మండిపోతుండటంతో సామాన్యుడి బడ్జెట్ అంచనాలు తప్పుతున్నది. నెలవారీ ఖర్చు తడిసి మోపెడవుతున్నది. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. మొన్నటి వరకు టమాటా, నిన్న ఉల్లి ధరలు ప్రజలను కూరలు చేసుకోనీయకుండా చేస్తే... నేడు చెక్కెర సామాన్య ప్రజల నోటిని చేదు చేస్తోంది. మరోవైపు బియ్యం, పప్పులు, ఇతర సరకుల ధరలు అమాంతం పెరుగుతుండగా.. ప్రస్తుతం పంచదార ధర కూడా విపరీతంగా పెరిగింది. ఇప్పటికే చక్కెర ధర రికార్డు స్థాయికి చేరిందని.. మరో రెండు, మూడు నెలల పాటు ఇవే ధరలు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సరిపడా నిల్వలు లేకపోవడం వల్లే ధరలు పెరుగుతున్నట్లు వివరించారు. వర్షాభావ పరిస్థితులు, చెరకు ఉత్పత్తిపై నెలకొన్న ఆందోళన, క్రష్షింగ్ సీజన్ ప్రారంభంలో నెలకొన్న ఆలస్యం ఇందుకు కారణం అని జేఎం ఫైనాన్షియల్ ఇన్ స్టిట్యూషన్స్ సెక్యూరిటీస్ తన నివేదికలో పేర్కొంది. అయితే చెరకు ఉత్పత్తిపై నెలకొన్న ఆందోళన నేపథ్యంలో పంచదార ఎగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే అంతర్జాతీయంగా కూడా చక్కెర ధరలు భారీగా పెరుగుతాయని, 12 ఏళ్ల గరిష్టానికి చేరుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు దేశంలో చక్కెర ఉత్పత్తి తగ్గిపోతుందని అంతా భావిస్తున్నారు. 2023, 2024 అక్టోబర్, సెప్టెంబర్ సీజన్ లో నికర చక్కెర ఉత్పత్తి 31.7 మిలియన్ టన్నులుగా ఉంటుందని ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్ ప్రాథమికంగా అంచనా వేసింది. అలాగే ఈ ఏడాది ఆగస్టు నెలలో ప్రధానంగా చెరకు ఎక్కువగా పండించే మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు దేశ వ్యాప్తంగా మెజార్టీ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే దేశ ఉత్పత్తిలో.. మహారాష్ట్ర, కర్ణాటక నుంచే దాదాపు 45 నుంచి 50 శాతం ఉంటుంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు పంట మార్చే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ఫలితంగానే చక్కెర ఉత్పత్తి మరింతగా పడిపోతుందని అంతా అనుకుంటున్నారు. రాబోయే సీజన్ లో దాదాపు 30 మిలియన్ టన్నులుగా ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. దేశీయ వినియోగం 25 నుంచి 28.5 మిలియన్ టన్నులుగా ఉంటుంది. అయితే పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఏమీ ఉండకపోవచ్చని... కానీ ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించాలని భావిస్తే మాత్రం మే నెల తర్వాతనే ఉంటుందని నివేదిక అభిప్రాయ పడింది.రష్యా నుంచి తక్కువ ధరకే గోధుమలు దిగుమతి చేసుకునే పనిలో పడింది భారత్. రష్యా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా గోధుమల సరఫరాలో అంతరాయం కలిగింది. ఈ దాదాపు అన్ని దేశాల్లోనూ ఈ ప్రభావం పడింది. ముఖ్యంగా భారత్‌లో ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ద్రవ్యోల్బణాన్ని అడ్డుకోవాలంటే డిమాండ్‌కి తగ్గట్టుగా సరఫరా ఉండాలి. అందులోనూ వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలున్నాయి. ఇలాంటప్పుడే ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తోంది మోదీ సర్కార్. అందులో భాగంగానే రష్యా నుంచి గోధుమలు దిగుమతి చేసుకునేందుకు ప్లాన్ చేస్తోంది. ప్రైవేట్ ట్రేడ్ ద్వారా అయినా, లేదంటే రెండు ప్రభుత్వాలు అధికారికంగా ఒప్పందం చేసుకునైనా గోధుమలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది కేంద్రం. మూడు, నాలుగు నెలలుగా తమ నెలవారీ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో 92 శాతం మంది తమ నెలవారీ ఖర్చులు పెరిగినట్టు చెప్పారు. 55 శాతం మంది ధరలు ఇంకా పెరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. నెల ఖర్చులు రాబోయే మూడు నెలల్లో 10-30% దాకా పెరగవచ్చని పేర్కొన్నారు. లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో భాగంగా దేశవ్యాప్తంగా 323 జిల్లాల్లో 23,500 మందిని ధరలపై ప్రశ్నించిందిఇప్పటికే రష్యాతో చర్చలు మొదలైనట్టు కొన్ని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జులై రికార్డు స్థాయి ధర పలికాయి గోధుమలు. గత 15 నెలల్లో ఎప్పుడూ లేనంతగా ధరలు పెరిగాయి. నిజానికి గోధుమలు దిగుమతి చేసుకునేందుకు భారత్ ఎప్పుడూ దౌత్య చర్చలు జరపలేదు. చివరిసారిగా 2017లో ఆ అవసరం వచ్చింది. ఇప్పుడు ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో ఆధార పడుతోంది.

## ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి

### జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మీన్ భాషా




**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మీన్ భాషా మెడికోలు, నర్సింగ్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో జరిగిన ఆయుష్మాన్ భవ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం స్వీప్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల ఆదేశాల మేరకు 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునే విధంగా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ, నమోదు చేయడం జరుగుతున్నదని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వైద్య విద్యాభ్యాసానికి వచ్చిన 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు ఫారం -6 లో గాని, ఓటరు యాప్ ద్వారా గాని నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు ప్రాధాన్యత పై అవగాహన కల్పించడంతో పాటు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగం పై అవహాన కల్పిస్తున్నామని తెలిపారు.

# కేసీఆర్ కు ఓటు అడిగే హక్కు లేదు

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు**

బీజేపీ నాయకులందరూ 24 గంటల ఉపవాస దీక్షలో పాల్గొంటున్నారు. రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది నిరుద్యోగులు.. తినడానికి తిండి లేని స్థితిలో ఉన్నారు. వారికి సంఘీభావంగా బీజేపీ దీక్ష చేస్తున్నది. తెలంగాణ ఉద్యమంలో తెగించి పోరాటం చేసింది రాష్ట్ర నిరుద్యోగ యువత. 9 ఏండ్లుగా నిరుద్యోగ యువత విషయంలో రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం వహించిందని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ ఛీఫ్ కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు ధర్నా చౌక్‌లో 24 గంటల ఉపవాస దీక్షలో అయన పాల్గోన్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ 1969లో తెలంగాణ యువత ఉద్యోగాలు, భవిష్యత్ విషయంలో అనేక పోరాటాలు చేశారు. ఆ రోజు కాంగ్రెస్ ప్రభుత్వ పోలీసు తూటాలకు 369 మంది బలయ్యారు. ఆరోజు కాల్చి చంపింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. మలిదశ తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగులు, విద్యార్థులు చదువు మానేసి.. మాకు తెలంగాణ కావాలి, ఉద్యోగాలు కావాలని పోరాటం చేశారు. తెలంగాణ రాదేమోనని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వదేమోనని 1200 మంది బిడ్డలు ఆత్మబలిదానం చేసుకున్నారు. కానీ ఆత్మబలిదానాలు చేసుకున్న వందల మంది యువకుల.. కుటుంబాలు నేడు రోడ్డున పడ్డాయి. ట్యాంక్బండ్పై మిలియన్ మార్చ్, సాగరహారం, వంటావార్పు.. ఇదే ధర్నా చౌక్లో ఏండ్ల తరబడి నిరుద్యోగులు పోరాటం చేశారు. కానీ తొమ్మిదేండ్లుగా నిరుద్యోగ యువత పట్ల కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నది. యూనివర్సిటీలు కళావిహీనంగా ఉన్నాయి. హాస్టళ్లలో పందికొక్కులు తిరుగుతున్నాయి. తెలంగాణ వస్తే.. వర్సిటీల్లో ఖాళీ లెక్చరర్ల పోస్టులు, స్కూళ్లు, కాలేజీల్లో టీచర్ల పోస్టులు భర్తీ అవుతాయని, తమకు ఉద్యోగాలు వస్తాయనుకున్నారు. డ్ల తరబడి ఈ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా, కోర్టు కేసులతో నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. టీచర్ పోస్టులు 25 వేలు ఖాళీలు ఉన్నాయి కదా? ఏమైంది? తొమ్మిదేండ్లుగా డీఎస్సీ వేయలేదు ఈ ప్రభుత్వం.. ఈరోజు ఏ మొహం పెట్టుకొని గ్రామాలకు వస్తారు.. కేసీఆర్. మీకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని అన్నారు.

# నిజామాబాద్‌ను వణికిస్తున్న జ్వరాలు



**నిజామాబాద్- ప్రభాత సూర్యుడు :** నిజామాబాద్ జిల్లాను విష జ్వరాలు వణికిస్తున్నాయి. డెంగ్యూ డేంజర్ బెల్ మోగిస్తుంటే.. మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు జిల్లా వాసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.విష జ్వరాలతో జనం ఆసుపత్రులకు క్యూడుతుంటే.. డెంగ్యూ పేరిట ప్రైవేట్ ఆసుపత్రులు దోపిడికి తెరలేపాయి? నిజామాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా ఇంటికొకరు జ్వర పీడితులు ఉంటున్నారు. ఫలితంగా నిజామాబాద్ కాదు జ్వరామాబాద్ గా మారుతోంది. వైరల్ ఫీవర్స్ తో ఆసుపత్రులు రోగులతో కిక్కిరిస్తున్నాయి. డెంగ్యూ కేసులు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. జిల్లాలో క్రమంగా కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ సీజన్ లో ఇప్పటి వరకు 156 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా డెంగ్యూ కేసులు నమోదవుతున్న.. జిల్లాల్లో నిజామాబాద్ రెండో స్దానంలో ఉందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. డెంగ్యూతో పాటు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు సంఖ్య ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నిజామాబాద్ జిల్లా ఆసుపత్రిలో వైరల్ ఫీవర్స్ తో వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఆసుపత్రికి వచ్చే వారిలో 30 మంది వైరల్ ఫీవర్స్ తో వస్తే.. ముగ్గురికి డెంగ్యూ నిర్ధారణ అవుతోందని వైద్యులు చెబుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు మాత్రం జ్వరంతో వెళితే డెంగ్యూ పేరుతో దోపిడి చేస్తున్నారు. అవసరం లేకున్నా టెస్టులు చేస్తూ.. రోగుల జేబులకు చిల్లు పెడుతున్నారు. జ్వరంతో వచ్చే రోగిని అడ్మిట్ చేసుకుని ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నారు. ఎలిసా టెస్టులకు అనుమతి లేకున్నా.. టెస్టులు చేసి రిపోర్టులు ఇస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించే స్తోమత లేక కొందరు సర్కారు ఆసుపత్రికి క్యూకడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు రోగులకు అనవసర టెస్టులు చేయవద్దని ఐఎంఏ విజ్ఞప్తి చేస్తోంది.నిజామాబాద్ జిల్లాలో వైరల్ ఫీవర్స్ క్రమంగా పెరుగుతుండటంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ వార్డులో 36 మంది జ్వర పీడితులు ఉండగా.. ముగ్గురు డెంగ్యూ పేషెంట్లు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇటు రోజురోజుకు వైరల్ ఫీవర్స్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వైరల్ ఫీవర్స్ కు తోడు డెంగ్యూ జ్వరాలు ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్నాయి. కాలనీల్లో అపరిశుభ్ర వాతావరణంతో డెంగ్యూ కేసులు ఎక్కువగా పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేస్తున్నారు.

# చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మౌనదీక్ష



**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా జగిత్యాల టిడిపి నాయకులు గాంధీ విగ్రహం ఎదుట మౌనదీక్ష చేపట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్దగల గాంధీ విగ్రహం ఎదుట జగిత్యాల టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ మహంకాళి రాజన్న ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ధీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహంకాళి రాజన్న మాట్లాడుతూ ఏపీ లో ప్రజాస్వామ్యం ఖుని అయ్యిందన్నారు.జగన్ రెడ్డి పాలనలో ఎఫైఆర్స్ ఉండవని అన్ని కుట్ర కేసులేనన్నారు. చంద్రబాబు అరెస్ట్ రోజునే 37 వ ముద్దాయిగా చేర్చడం ఎంతవరకు సమంజసం అని రాజన్న ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి చర్య తప్పు అని ఇరురాష్ట్రాల ప్రధాన పార్టీల నాయకులు విమర్శించినా పట్టించుకోకపోవడం దురదృష్ట కరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓరుగంటి భార్గవ్ రామ్, కొండ శ్రీదర్ అక్కినపెల్లి కాశినాతం, బత్తుల కొండయ్య, భూమారెడ్డి,సోమా నారాయణ రెడ్డి, నక్క లక్ష్మణ్, కోయ బాలకృష్ణ, రంగు శ్రీనివాస్, ఆవుల రాయుడు, మగ్గిడి గంగాధర్, వుప్పుల రవి, కందుకూరు తిరుపతి,జలెందర్ రెడ్డి, నర్సయ్య,రాజయ్య యాదవ్, రాజేష్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పరిశ్రమలకు

# సింగిల్ విండో పద్ధతి



**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు**

రాజకీయాలు ఎప్పుడు ఉంటాయి..అవి ఎన్నికప్పుడు చేసుకోవచ్చు. పరిశ్రమలు వచ్చినప్పుడు అందరూ సహకరించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలకు సింగిల్ విండో తీసుకువచ్చింది. తెలంగాణ లో పెట్టుబడులు పెట్టె పరిశ్రమలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. స్థానిక యువతకు ఉద్యోగం కల్పించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 400 మందికి ఉపాధి లభిస్తుంది. స్థానిక ప్రజాప్రతినిధులు మీ ప్రాంతాల్లో పరిశ్రమ వస్తే సహకరించాలి. కొంతమంది రాజకీయాలు చేస్తారు.. నిజా నిజాలు తెలుసుకోవాలి. ఎవరు పరిశ్రమ పెట్టినా కేరాఫ్ అడ్రస్ గా తెలంగాణ మారింది. భారతదేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగింది. తెలంగాణ లో 5 రకాల విప్లవాలు ఆవిష్కృతమవుతున్నాయని అన్నారు.

## కేయూ విద్యార్థులకు కాంగ్రెస్ అండ




**వరంగల్- ప్రభాత సూర్యుడు**

కేయూ విద్యార్థుల ఆందోళనకు కాంగ్రెస్ అండగా ఉంటుందని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వైస్ ఛాన్సలర్ తాటికొండ రమేష్ అక్రమాలపై విచారణ జరిపిస్తాం. విద్యార్థుల ను కొట్టిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల కాళ్ళు చేతులు విరగొట్టే అధికారం పోలీసులకు ఎవరు ఇచ్చారు? విద్యార్థుల పై దాడికి బేషరతుగా సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. వందరోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. నూటికి నూరు శాతం సమస్య పరిష్కరించే విధంగా కాంగ్రెస్ కార్యాచరణ ఉంటుంది. కేయులో జరిగిన అక్రమాలపై విచారణ జరిపిస్తాం చర్యలు తీసుకుంటామని అన్నారు. సెలవులు పొడగించడం హాస్టళ్ళను మూసివేయడంతో సమస్య పరిష్కారం కాదు. విద్యార్థి ఉద్యమాలతోనే కేసిఆర్ సీఎం అయ్యిండు. ఓయు కేయు విద్యార్థుల పోరాటంతోనే బిఆర్ఎస్ నేతలకు పదవులు వచ్చాయి. పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వానికి బట్రోత్ గా మారిన వ్యక్తే కేయుకు వైస్ ఛాన్సలర్ అయిండు. ఏనాడు కూడా విద్యార్థులు అందోళన చేస్తే పోలీసులను యూనివర్సిటీ క్యాంపస్ లోకి విసి రానివ్వలేదు. కేయులో ఆందోళన దిగిన విద్యార్థులను పోలీసులకు పట్టించి కొట్టించిన వైస్ ఛాన్సలర్ రిజిస్ట్రార్ ను భర్తరఫ్ చేయాలి. ఇద్దరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి. దొర పోకడను ప్రశ్నిస్తే విద్యార్థులపై దాడులు చేయిస్తున్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలు ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి లు ప్రభుత్వ యూనివర్సిటీ లను మూసివేసేలా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

## పెన్షనర్ల సమస్యలపై ఎమ్మెల్సీ కవితకు వినతి

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఎమ్మెల్సీ కవిత కు వినతిపత్రాన్ని సమర్పించారు. బుధవారం జిల్లా కేంద్రంలో మ్యాంగో మార్కెట్ లో జరిగిన బీ.ఆర్.ఎస్. జగిత్యాల నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత కు హరి ఆశోక్ కుమార్ పెన్షనర్ల కు ప్రతి నెలమొదటి తేదీనే పెన్షన్లు అందేలా చూడాలని, ఉద్యోగులకు, పెన్షనర్స్ కు పీఆర్సీ ప్రకటన కు,డి.ఏ.ల విడుదలకు, అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో నగదురహిత వైద్య సేవలు అందెట్లు తదితర సమస్యలు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పెన్షనర్స్ ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విష్వనాథం,తదితరులు పాల్గొన్నారు.

## డాక్ డెవలప్‌మెంట్ ప్రారంభించిన పీఎంజీ శ్రీలత

**సికింద్రాబాద్- ప్రభాత సూర్యుడు :** కేంద్రప్రభుత్వ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఒక్క ఇంటికి చేరాలనిడాక్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం ను నేడు అర్బన్ ప్రాంతంలోని మల్కాజిగిరి ముదిరాజ్ భవనంలో పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత ప్రారంభించారు. 150 సంవత్సరాల చరిత్ర ఉన్న పోస్టల్ శాఖ సామాన్యులకు అందుబాటులో ఉండేవిధంగా జీవిత భీమా, మనిబ్యాగ్ పాలసీ, చిన్నారులకు శిశు పథకాలు,మహిళల పొదుపు పథకాలు,తో పాటు యాక్సిడెంట్ పాలసీలు ప్రారంబించడం జరిగిందని శ్రీలత వివరించారు. ఇతర ఇన్స్యూరెన్స్ కంపెనీలకు తీసిపోని విధంగా బీద సామాన్యులు ప్రీమియం కట్టుకునే విధంగా10 లక్షల యాక్సిడెంట్ పాలసికి 398 సంవత్సరానికి చెల్లిస్తే సరిపోతుందని ఎలాంటి చిన్న యాక్సిడెంట్ కూడా వర్తిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పోస్టల్ శాఖ ప్రజల్లో మమేకమై ప్రతి ఒక్కరి వద్దకు పథకాలు చేరవేయలన్నదే పోస్టల్ శాఖ ముఖ్యఉద్దేశం అని శ్రీలత తెలిపారు.

## పదవీ విరమణ వయస్సు మరో ఐదేళ్లు పెంపు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ఉద్యోగులకు శుభవార్త. వారి పదవీ విరమణ వయస్సును ఐదేళ్లు పెంచారు. దీంతో ఇప్పుడు ఉద్యోగులు 65 ఏళ్ల వరకు సర్వీస్ బెనిఫిట్స్ పొందే అవకాశం ఉంటుంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయంతో ఎట్టకేలకు ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 65 సంవత్సరాలకు పెంచింది. పదవీ విరమణ వయస్సు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 30 నుండి చెల్లుబాటు అవుతుంది. పదవీ విరమణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు.మినీ అంగన్‌వాడీ అసిస్టెంట్లు, టీచర్లకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేయనున్నారు. అంతే కాదు ఉపాధ్యాయులు, సహాయకులకు కూడా ఆసరా పింఛను అందజేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఈ నిర్ణయం తీసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులకు 50 ఏళ్ల వరకు రూ.2 లక్షల బీమా, 50 ఏళ్లు పైబడిన వారికి రూ.200,000 ఎక్స్‌గ్రేషియా అందజేస్తారు. సర్వీసులో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు మరణిస్తే రూ.20వేలు, సహాయకులు సర్వీసులో చనిపోతే రూ.10వేలు తక్షణ సాయం అందజేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 70,000 మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులకు గణనీయమైన ప్రయోజనాలు చేకూరనున్నాయి.తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.115 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులకు అత్యధిక వేతనాలు చెల్లిస్తోందన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.13650 వేతనం అందజేయగా, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు టీచర్లకు రూ.7800 చెల్లిస్తున్నారు.

## నిరుద్యోగుల కోసం నిరసన

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

బీజేపీ 24 గంటల ఉపవాస దీక్ష ప్రారభమైంది. కేసిఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా?ధర్నాచౌక్, ఇందిరా పార్క్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి దీక్ష చేపట్టారు. గురువారం ఉదయం 11 గంటల వరకు దీక్ష కొనసాగనుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక పూట తింటూ ఒక పూట ఉపవాసం ఉంటున్న నిరుద్యోగ యువతకు సంఘిబావనికి ఈ ఉపవాస దీక్ష చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ పోరాటంలో కీలకంగా ఉంది యువత అన్నారు. ప్రాణాలకు తెగించి పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణ అడిగితే కాల్చిపారేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ ఆరోపించారు. తెలంగాణ కోసం విద్యార్థులు కాలికి గజ్జ కట్టి అడారని ఆవేదన వ్యక్తం చేశారు.నిరుద్యోగ యువత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వదని 12 వందల మంది ఆత్మ బలిదానం చేసుకుందని అన్నారు. కెసిఆర్ కుటుంబం కి సంబందించిన వ్యక్తి ఒకరు పెట్రోల్ పోసుకున్నారని గుర్తు చేశారు. అయితే అప్పటి నుంచి ఈ రోజు వరకు ఆయనకు అగ్గిపెట్టె దొరకలేదని వ్యంగాస్త్రం వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతపై వివక్షతతో ఉందన్నారు. విశ్వ విద్యాలయాలు కల కల లడుతాయని, ఖాళీలు భర్తీ అవుతాయని అనుకున్నారని తెలిపారు. ఉద్యోగాలు వస్తాయని భావించారని తెలిపారు. నిరుద్యోగ యువతను పథకం ప్రకారం మోసం చేసింది ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ చేతకాని తనం వల్ల పేపర్ లీకేజీ లు అవుతున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు.

## బీసీల రాజకీయ పోరాట యోదుడు ఆర్ కృష్ణయ్య

**సంగారెడ్డి - ప్రభాత సూర్యుడు**

రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య 67వ జన్మదిన వేడుకలు విద్యానగర్ బీసీ సంక్షేమ భవన్ లో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ను శాలువాతో పూలగుచ్చంతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా న్యాయం జరిగే వరకు ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో చట్టాన్ని అనుసరించి ఒక న్యాయవాదిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కోవూరి సత్యనారాయణ గౌడ్ బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో 50 శాతం పొలిటికల్ రిజర్వేషన్లు కల్పించే వరకు 10 లక్షల మందితో అలుపెరుగని పోరాటం చేస్తూ బీసీలకు న్యాయం చేకూర్చుటకు ముందు ఉంటానని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పులి సంగప్ప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆయుష్మాన్ భావ కార్యక్రమాన్ని

# సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా**



**జగిత్యాల - ప్రభాత సూర్యుడు**

ప్రజల ఆరోగ్య విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. బుధవారం రోజున భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ వర్చువల్ విధానం ద్వారా "ఆయుష్మాన్ భావ" కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికి నాణ్యమైన వైద్య సేవలం దించేందుకు ప్రభుత్వం ఆరోగ్య కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నదని, దేశ ప్రజలందరూ వాటిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య వంతులుగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో దృశ్య మాధ్యమాన్ని కలెక్టర్, అధికారులు, మెడికోలు, తదితరులు తిలకించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ప్రారంభిం చిన "ఆయుష్మాన్ భావ" కార్యక్రమాన్ని ప్రజలం దరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఏ ఒక్కరిని కూడా వదిలివేయకుండా ఈ కార్యక్రమం కింద ఆరోగ్య సేవలు పొందాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆరోగ్య సేవలకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో, పల్లె, పట్టణ దవఖానాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతీ జిల్లాలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, కంటి వెలుగు, ఆరోగ్య మహిళా కార్యక్రమాలను విస్తృతంగా అమలు పరుచడం జరుగుతున్నదని అన్నారు. టి-హబ్ లను ఏర్పాటు చేసి 134 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా ప్రజలకు అందించడం జరుగుతున్నదని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలను నిర్వహించడం జరుగుతున్నదని కలెక్టర్ వివరించారు.జిల్లాలో నిరంతర వైద్య సేవలందిం చేందుకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబా టులో ఉంచడానికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ నాణ్యమైన సేవలందిస్తూ రాష్ట్ర స్థాయిలో జిల్లాను అగ్రభాగాన నిలపాలని ఆకాంక్షించారు. అనం తరం అవయ వదానం పై హాజరైన వారందరితో ప్రతిజ్ఞ నిర్వహించారు. టి.బి. వ్యాధిగ్రస్తులకు భోజన కిట్లను పంపిణి చేసిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్. రాజేశ్వర్ (కోరుట్ల), అజయ్ రెడ్డి (జగిత్యాల) లను శాలువాలతో కలెక్టర్ సత్కరించారు..ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీధర్, ఇతర వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, జిల్లా అధికారులు, మెడికోలు, నర్సింగ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రత, బందోబస్తు కొరకే గణేష్ ఆన్లైన్ నమోదు

**గణేష్ మండప నిర్వాహకులు పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలి**

**జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**



**జగిత్యాల - ప్రభాత సూర్యుడు**

పోలీసు శాఖ వారు రూపొందించిన గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపం నకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని, ఈ యొక్క సమాచారం ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందని , ఆన్ లైన్ ఇన్ఫర్మేషన్ కు ఎటువంటి రుసుము లేదని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు.గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయుటకు ముందు, ముందస్తు సమాచారం పోలీసుస్టేషన్ లో సమాచారం ఇవ్వాలని అందుకోసం ఏదైనా కంప్యూటర్, మొబైల్ నందు అప్లై చేసుకోవాలని అన్నారు. అప్లికేషన్ ను సంబంధిత పోలీస్ స్టేషన్ నందు అందించాలని సూచించారు. అలాగేసామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదని ఎవ్వరికైన ఎలాంటి సందేహాలు ఉన్న సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఈ పండుగను అందరము శాంతి యుతంగా నిర్వహించు కోవాలని ఎస్పీ కోరారు.

## బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

జమిలీ ఎన్నికలపై బీఆర్ఎస్ నేత, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యల చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ ఎలాగైనా కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ పావులు కదుపుతోందన్నారు.అందుకే ఎన్నికలు విషయంలో దేశవ్యాప్తంగా గందరగోళ పరిస్థితి సృష్టిస్తున్నారని మండిపడ్డారు గుత్తా సుఖేందర్‌రెడ్డి. డిసెంబర్‌లోగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా.. కేంద్రం వెనకడుగు వేస్తోందని దుయ్యబట్టారు. జమిలీ ఎన్నికల పేరుతో ప్రజలను గందరగోళంలో పడేశారన్నారు. జమిలీ ఎన్నికలు సాధ్యం కాకపోతే మినీ జమిలీ నిర్వహించాలని బీజేపీ ప్రయత్ని స్తోందని చెప్పారు. ప్రజలు, రాజకీయ పార్టీలను గందరగోళ పరిచి వచ్చే ఎన్నికల్లో గట్టెక్కాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపిస్తున్నారు గుత్తా సుఖేందర్‌రెడ్డి. తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం మాత్రం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ సాధ్యాసాధ్యాలపై.. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఇప్పటికే కమిటీ వేసింది మోడీ సర్కార్. ఈనెల 18 నుంచి జరగబోయే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కమిటీ ఇచ్చే నివేదికను సభలో పెట్టబోతుందని సమాచారం. అయితే.. జమిలి ఎన్నికలు నిర్వహించాలని దానికి ఎంతో ప్రాసెస్ ఉంటుంది. దీంతో జమిలీ సాధ్యం కాకపోతే... మినీ జమిలీ ఎన్నికలు అయినా నిర్వహించాలని కేంద్రం యోచిస్తోందట. మినీ జమిలి అయితే... అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రాలకు అనుకూలంగా ఉంటుందని మోడీ సర్కార్ భావిస్తోంది. మినీ జమిలి కూడా జనవరి, ఫిబ్రవరిలో కాదు.. ఏప్రిల్, మేలో జరగొచ్చనే అంచనా వేస్తున్నారు.ఈ ఏడాది డిసెంబర్ నాటికి తెలంగాణ, మిజోరం, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అలాగే... 2024లో ఆంధ్ర ప్రదేశ్, సిక్కిం, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ సహా 12 రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు జరగాలి. దేశమంతా ఒకే సారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోతే... డిసెం బర్‌లోగా జరగాల్సిన తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను వచ్చే ఏడాదిలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు నిర్వహించొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. లేదా... లోక్‌సభ ఎన్నికలనే ముందుగా జరపొచ్చని భావిస్తున్నారు.జమిలీ ఎన్నికలపై తెలంగాణ నేతలు కూడా లీకులు ఇస్తుండటంతో అదే జరగొచ్చని ప్రజలు భావిస్తున్నారు. తెలంగాణలో మరో మూడు నెలల్లో ఎన్నికలు వస్తాయా లేదా అన్నది మాత్రం ఇప్పటికీ స్పష్టత లేదు. ఎన్నికలు సమయానికి జరిగినా... ఆలస్యమైనా ఎదుర్కొ నేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం కేసీఆర్ కూడా ఇప్పటికే పార్టీ నేతలకు సూచించినట్టు సమాచారం.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

హైదరాబాద్ లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు.. వ్యాపారి గొంతును కోసేశారు. పదునైన ఆయుధంతో అర్ధరాత్రి దాడి చేసి చంపేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. 28 ఏళ్ల నదీమ్ తాహే రియల్ ఎస్టేట్ వ్యాపారి. అయితే ఇతడు నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన వాడు. సోదరి భర్త ఆరోగ్యం బాగాలేకపోవడంతో అతడి తల్లిదండ్రులు టోలిచౌక్ లోని వారి నివాసానికి వచ్చి ఉంటున్నారు. ఈక్రమంలోనే కొద్ది రోజుల క్రితం అతడి సోదరుడుతో పాటు నదీమ్ కూడా సోదరి ఇంటికి వచ్చారు. మంగళవారం రాత్రి టీ తాగేందుకు స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లాడు. రాత్రి అవుతున్నా ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు ఫోన్ చేశా?రు. ఫోన్ ఎత్తిన నదీమ్ తాహే.. ఓ దాబాలో భోజనం చేస్తున్నాను, త్వరగానే ఇంటికి వచ్చేస్తానని చెప్పాడు. అలా చెప్పి చాలా సమయం గడుస్తున్నా నదీమ్ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు మరోసారి ఫోన్ చేశారు. అయితే నదీమ్ మాత్రం ఫోన్ లేపలేదు. ఇలా ఎన్నిసార్లు ఫోన్ చేసినా అతడు స్పందించలేదు. ఉదయం అబ్దుల్ నదీమ్ హత్యకు గురయ్యాడంటూ... పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. రాత్రి తమతో చక్కగా మాట్లాడిన కుమారుడిని ఇంత దారుణంగా హత్య చేయడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి అబ్దుల్ ఖయ్యూం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మున్నేరులో కొట్టుకొచ్చిన గుర్తు తెలియని శవం

**ఖమ్మం- ప్రభాత సూర్యుడు :** ఖమ్మం రూరల్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం మున్నేరు వాగులో కొట్టుకువచ్చింది. మున్నేరు వరద తగ్గడంతో పడమటి తండా పంచాయితీ జాన్ బాద్ తండా దగ్గర శవం ఒడ్డుకు చేరింది. గొనేసంచిలో శవాన్ని గుర్తించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారమందించారు. శవం కాళ్లు చేతులు కట్టి గోనెసంచిలో మూటకట్టి వేశారని పోలీసులు వెల్లడించారు. శవం పురుగులు పట్టడంతో అన్నం పౌండేషన్ కి సమాచారం ఇచ్చారు. అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శవాన్ని బయటకు తీసారు. శరీరంపై గాయాలు ఉండడంతో హత్య చేసి మున్నేరు లో వేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

## విప్రో దగ్గర చంద్రబాబుకు మద్దతుగా నిరసన




**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద చంద్రబాబుకు మద్దతుగా ఐటీ ఉద్యోగులు నిరసనకు దిగారు. బుధవారం మధ్యాహ్నం విప్రో సర్కిల్ వద్ద ఐటీ ఉద్యోగులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబుకు సంఘీభావం ప్రకటిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఐయాం విత్ సీబీఎన్' పేరుతో మెయిల్స్, సోషల్ మీడియా ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఇన్విటేషన్ షేర్ అయింది. రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలో చంద్రబాబు బాధితుడు. ఈ సంక్షోభ సమయంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు చంద్రబాబుకు సంఘీభావం ప్రకటించాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది' అంటూ దీనికి సంబంధించిన పోస్టర్ లో పేర్కొన్నారు..

## ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

**సిద్దిపేట- ప్రభాత సూర్యుడు :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోట్లపల్లి గ్రామంలో సీతారామ చంద్ర స్వామి ఆలయంలో రాష్ట్ర మంత్రి హరీశ్ రావు బుధవారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షుడు బోయినపల్లి వినోద్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్, జెడ్పీ చైర్మన్ రోజాశర్మలతో కలిసి సీతారామ ఆలయ పునర్నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో రసాభస

**ఖమ్మం- ప్రభాత సూర్యుడు :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం జరిగిన సత్తుపల్లి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో గందరగోళం నెలకొంది. మానవతారాయ్ వర్గం మట్టా దయానంద్ వర్గం పోటాపోటీ నినాదాలు చేసుకున్నాయి. ఒకరికి ఒకరు కుర్చీలు విసురుకోవడంతో కార్యకర్తలకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్ర మాజీ మంత్రి రేణుక చౌదరి సమావేశంనుంచి వెళ్లిపోయారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215